### ఇందల్వాయిలో

## రోగులకు పండ్లు పంపిణీ



ఇందల్వాయి, బతుకమ్మ :ఇందల్వాయి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పుట్టినరోజు సందర్భంగా పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు చిలువేరి దాసు మాట్లాడుతూ రాబోయే ప్రభుత్వం బిఆర్ఎస్ ప్రభుత్వమని జోస్యం చెప్పారు. ప్రతి ఒక్క కార్యకర్త పార్టీ కోసం పని చేస్తే రాబోయే రోజుల్లో మంచి రోజులు వచ్చే అవకాశం ఉందని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు శెట్టి బిరీష్, పార్టీ సీనియర్ నాయకులు కుమార్, మాజీ ఎంపీటీసీలు సుధాకర్, చింతల దాసు, రాంరెడ్డి, మఠంల నాగేష్ ,నామాల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బోనాల మహోత్సవం

### బోనాలు సమర్పించిన డీసీసీ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ




నిజామాబాద్ సిటీ, బతుకమ్మ :శ్రీ భూలక్ష్మీ మాత అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శ్రీ భూలక్ష్మీ మాత అమ్మవారికి బోనాల సమర్పణ మహోత్సవం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగర కాంగ్రెస్ డీసీసీ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ పాల్గొని అమ్మవారికి బోనం ఎత్తి సమర్పించారు. బోనాల వేడుకల సందర్భంగా భక్తులు సంప్రదాయ దుస్తులు ధరించి, మంగళ వాయిద్యాలు, పోతురాజుల విన్యాసాల నడుమ బోనాలతో ఘనంగా ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి నైవేద్యంగా బోనాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తుల శివసత్తుల పూనకాలు, గోవింద నామస్మరణలతో ఆధ్యాత్మిక వాతావరణంగా మారింది. ఈ సందర్భంగా నగర కాంగ్రెస్ డీసీసీ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ మాట్లాడుతూ నగర ప్రజలందరూ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. అలాగే సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులకు మంచి పంటలు పండాలని కోరుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ ఉమారాణి, టీటీసీఎస్ టి రాష్ట్ర చైర్మన్ శేఖర్ గౌడ్, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, స్థానిక కార్పొరేటర్ స్రవంతి రెడ్డి, మాజీ మేయర్ ఆకుల సుజాత తదితర ప్రముఖులు పాల్గొన్నారు. అలాగే అభివృద్ధి కమిటీ సభ్యులు తోట గోపాల్, మిద్దె రవి, ఆకుల శ్రీశైలం తదితరులు హాజరయ్యారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అభివృద్ధి కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ మహోత్సవంలో అభివృద్ధి కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో ఆరుతడి పంటలపై దృష్టి సారించాలి

### అదనపు కలెక్టర్ భుజంగరావు





నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో రైతులు నీటి వినియోగం తక్కువగా ఉండే ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించేలా అవగాహన కల్పిస్తున్నామని అదనపు కలెక్టర్ వి.భుజంగరావు అన్నారు. పంటల మార్పిడి విధానం ద్వారా సమకూరే ప్రయోజనాల గురించి వివరిస్తూ, రైతులు ముందుకు వచ్చేలా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు శుక్రవారం ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, విద్య, గ్రామీణ అభివృద్ధి, వ్యవసాయ తదితర శాఖల అధికారులతో విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ, పంటల సాగు, సీజనల్ పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు. విద్యార్థులకు 2 జతల ఏకరూప దుస్తులు త్వరగా అందించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. 1వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు విద్య అభ్యసించే విద్యార్థులందరికీ 2 జతల ఏకరూప దుస్తులు ఆగస్టు 25వ తేదీలోగా అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎల్ నినో వర్షబావ పరిస్థితుల దృష్ట్యా వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటల సాగు వైపు అవగాహన కల్పించి రైతులను ప్రోత్సహించాలని, కందులు, పెసర్లు, కూరగాయల పంటల సాగు శ్రేయస్కరం అని రైతులకు సూచించాలని తెలిపారు. సిజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. వీ.సీ అనంతరం అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారులతో సమావేశమై సూచనలు చేశారు. ప్రతి రైతుకు అవగాహన కల్పించేలా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు, భూగర్భ జల శాఖ అధికారులు కృషి చేయాలని, ప్రజాప్రతినిధుల సమన్వయంతో క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక విధాలుగా తోడ్పాటును అందిస్తోందని, అర్హులైన ప్రతి రైతు ప్రభుత్వ తోడ్పాటును సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఏకరూప దుస్తులు నిర్ణీత గడువు లోపు అందేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అధికారుల పరస్పర సమన్వయంతో పని చేస్తూ సకాలంలో విద్యార్థులు అందరికీ ఏకరూప దుస్తులు అందేలా కృషి చేయాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సాయన్న, జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, ముఖ్య ప్రణాళిక అధికారి కిషన్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మరణించిన హోమ్ గార్డ్ కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా

### బ్యాంకు ఖాతాలో జమ చేసిన తెలంగాణ ప్రభుత్వం



కామారెడ్డి, బతుకమ్మ :విధి నిర్వహణలో సేవలందించి మరణించిన హోమ్ గార్డ్ కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా మొత్తం బ్యాంకు ఖాతాలో జమ అయింది. కామారెడ్డి జిల్లా హోమ్ గార్డ్స్ సంస్థకు చెందిన హోమ్ గార్డ్ నెం.247 జి. శ్రీనివాస్ గత సంవత్సరం మృతి చెందారు. ఆయన కుటుంబానికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5 లక్షలు ఎక్స్ గ్రేషియా సాయాన్ని ఆయన సతీమణి రేఖ బ్యాంకు ఖాతాలో జమ చేశారు. ఈ సందర్భంగా రేఖ జిల్లా పోలీసు అధికారి యం.రాజేష్ చంద్ర ను మర్యాదపూర్వకంగా కలిసి, తమ కుటుంబానికి ఎక్స్ గ్రేషియా అందేలా చర్యలు తీసుకున్న తెలంగాణ ప్రభుత్వం, పోలీసు శాఖ, హోమ్ గార్డ్స్ శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, విధి నిర్వహణలో సేవలందించే హోమ్ గార్డుల కుటుంబాల సంక్షేమంపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని తెలిపారు. మరణించిన హోమ్ గార్డుల కుటుంబాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, పోలీసు శాఖ తరఫున అవసరమైన సహాయ సహకారాలు నిరంతరం అందిస్తామని భరోసా ఇచ్చారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించిన ఎస్పీ, ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల ప్రయోజనాలు వారికి సకాలంలో అందేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హోమ్ గార్డుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన హోమ్ గార్డుల కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించే లక్ష్యంతో పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని ఎస్పీ పేర్కొన్నారు.

# ఆర్ బి ఎస్ కే ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :కోట గల్లి శంకర్ భవన్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శు క్రవారం విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భాస్కర్ ఆధ్వర్యంలో ఒకటవ తరగతి నుంచి ఐదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు ఈ వైద్య పరీక్షలు నిర్వహించారు. సీజనల్ వ్యాధులతో పాటు విద్యార్థులు ఎదుర్కొంటున్న వివిధ ఆరోగ్య సమస్యలను గుర్తించేందుకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ భాస్కర్ తెలిపారు. ముఖ్యంగా కంటిచూపు సమస్యలు, చర్మం, చెవి, ముక్కు, గొంతు సంబంధిత సమస్యలు, రక్తహీనత వంటి సమస్యలను గుర్తించి అవసరమైన వారికి ఉచితంగా చికిత్స అందించడం ఆర్బిఎస్కే (=దీూఖ) కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో చికిత్స సాధ్యం కాని కేసులను హైదరాబాద్‌లోని ఆస్పత్రులకు రిఫర్ చేసి మెరుగైన వైద్యం అందిస్తామని డాక్టర్ భాస్కర్ తెలిపారు. విద్యార్థులకు హెల్త్ కార్డులు అందించేందుకు కూడా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. గత వారం జిహెచ్ఎస్ శంకర్ భవన్ హైస్కూల్‌లో నిర్వహించిన వైద్య పరీక్షల్లో సుమారు 40 మంది విద్యార్థులు వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు గుర్తించామని, ఒక సర్జరీ అవసరమైన కేసును గుర్తించి మెరుగైన వైద్యం కోసం రిఫర్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామచందర్ గైక్వాడ్, ఆర్బిఎస్కే సిబ్బంది, ఉపాధ్యాయులు దయానంద్, నందిని, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



# జిల్లా కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన డాక్టర్ ఎం. శ్రీనివాస్



బాన్సువాడ, బతుకమ్మ :కామారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య సేవల సమన్వయకర్త డిసిహెచ్ఎస్ బాన్సువాడ ఏరియా ఆసుపత్రి, మాతా -శిశు ఆసుపత్రి ఎంసిహెచ్ మెడికల్ సూపరింటెండెంట్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఎం. శ్రీనివాస్ శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ జిల్లా కలెక్టర్‌కు పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జిల్లాలో వైద్య సేవల ప్రస్తుత పరిస్థితి, ఆసుపత్రుల నిర్వహణ, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చేపట్టాల్సిన చర్యలపై కలెక్టర్‌తో చర్చించారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన, అందుబాటులో ఉండే వైద్య సేవలను ప్రజలకు అందించేందుకు జిల్లా యంత్రాంగంతో సమన్వయంతో పనిచేస్తామని డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ముఖ్యంగా ఆసుపత్రుల్లో మౌలిక వసతుల మెరుగుదల, వైద్య సిబ్బంది సేవల సమర్థ వినియోగం, మాతా-శిశు ఆరోగ్య సేవల బలోపేతం, ప్రజారోగ్య కార్యక్రమాల సమర్థవంతమైన అమలు, ప్రభుత్వ వైద్య సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. జిల్లాలో ఆరోగ్య సేవల నాణ్యతను మరింత మెరుగుపరిచే దిశగా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటూ, ప్రజలకు సత్వర వైద్య సేవలు అందేలా కృషి చేస్తామని డాక్టర్ శ్రీనివాస్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధి, ప్రజారోగ్య పరిరక్షణలో పరస్పర సమన్వయంతో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ సూచించినట్లు సమాచారం.